# మానసిక సంక్షోభం

బి. విద్యాసాగర్

ఆ రోజు ఉదయం లక్ష్మి స్నానంచేసి సోఫాలో కూర్చుని న్యూస్ పేపర్ చదువుతోంది. ప్రపంచంలోని వింతలూ విశేషాలు తెలుసుకుని ఆనందిస్తోంది. ఇంతలో వాళ్ళ నాయనమ్మ పిలిస్తే, లోపలకు వెళ్ళి టిఫిన్ తిని, కాఫీ త్రాగి, మళ్ళీ సోఫాలో వచ్చి కూర్చుంది. కొంసేపు న్యూస్ పేపరు చూశాక వారపత్రిక చేతి లోకి తీసుకుని చదవటం మొదలు పెట్టింది. ఇంతలో "పోష్టు" అని కేక వినిపించి, లేచి బయటకు వెళ్ళి వుత్తరం తీసుకుంది. అది వాళ్ళ అమ్మ దగ్గర నుంచి వచ్చిన వుత్తరం.

ఉత్తరం చదువుకుని ఆశ్చర్య పోయింది. ఆమె తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకున్నదట! లక్ష్మి నమ్మలేక పోయింది. ఏమిటి అమ్మ మళ్ళీ చేసుకుందా? తన తండ్రిని అప్పుడే మరచి పోయిందా? ఎంత విచిత్రం.

లక్ష్మిలో మానసిక సంక్షోభం కలిగింది. తన తల్లి ఎవరికీ చెప్పకుండా మళ్ళీ ఎందుకు పెళ్ళి చేసుకుంది. తన తండ్రి జీవించినంతకాలం తన ఆరాధ్య దైవంగా భావించిన ఆమెలో యింత మార్పు ఎలా వచ్చింది. గౌరవప్రదమైన తమ వంశానికి, ఈ పెళ్ళితో మాయని మచ్చ తెచ్చింది. లక్ష్మికి ఆ క్షణంలో తల్లిపై ద్వేషం కలిగింది. వివాహం చేసుకున్న వ్యక్తిపై ఆగ్రహం వచ్చింది. కోపం ఆపుకోలేక, నాయనమ్మ దగ్గరకు వెళ్ళి-

"నాయనమ్మా! విన్నావా? మా అమ్మ మళ్ళీ పెళ్ళి చేసుకుందట! ఇవాళే ఉత్తరం వచ్చింది" అంది.

"ఏమిటే, విచిత్రంగా వుంది. మీ అమ్మ పెళ్ళి చేసుకుందా? నమ్మలేకుండా వున్నాను" అంది ఆవిడ.

"నేనూ నమ్మలేకపోయాను. కానీ,

వుత్తరం చదివాక, నమ్మక తప్పలేదు."

"ఈ వయస్సులో మీ అమ్మకు మళ్ళీ పెళ్ళి యేమిటి? విచిత్రంగా వుంది."

"విచిత్రమే! అమ్మ నా గురించికానీ మన వంశ ప్రతిష్ఠ గురించి కానీ ఆలోచించకుండా ఈ పనికి పూనుకుంది. నాన్నను మరచిపోయి, తన దోవ తను చూసుకుంది" అంది లక్ష్మి తల్లిని తిట్టుకుంటూ.

లక్ష్మి ఆ రోజల్లా ఎంతో బాధ పడింది. తను ఆత్మహత్య చేసుకుందామన్నంత ఆవేశం వచ్చి, మళ్ళీ ఎలాగో నిగ్రహించుకుంది... వాళ్ళ నాయనమ్మ బాధపడవద్దని వోదార్చింది.

తను ఆత్మహత్య చేసుకుంటే... తను ఒక పిశాచంగా మారి, తన తల్లిని వెంటాడి ఆమెకు జీవితంలో సుఖమూ, ఆనందమూ లేకుండా చేయగలదు. అప్పుడు తనకు తృప్తిగా వుంటుందని భావించింది. కానీ, ఆత్మహత్య మహా పాపమని, అది పిరికివాళ్ళు చేసే పని అని గ్రహించి, ఆ ప్రయత్నం విరమించుకుంది. తర్వాత ఆమె మనస్సులో తండ్రిని గురించిన ఆలోచన వచ్చింది. ఆయన లావుగా, పొడుగ్గా వుండేవారు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతూ వుండేవారు. ఆయన గొంతులో గాంభీర్యం వుంది. ఆయన సైన్యంలో పనిచేయడం వలన. ఆయన యే కార్యం తలపెట్టినా, అది పూర్తిచేయాలనే పట్టుదల ఆయనకు అలవడింది. ఆయన తమ బంధువులకు, ఆయనమిత్రులకు ఎన్నోసార్లు సహాయం చేశారు.

లక్ష్మి ఆలోచిస్తుంటే, ఆమెకు గత జీవితం జ్ఞాపకం వచ్చింది. తమ తల్లిదండ్రులు ఆదర్శదంపతులుగా వుండేవారు ఆ రోజుల్లో. ఇరువురూ వొకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. వారికి తానొక్కతే సంతానం కావడంతో తనను అమితంగా ప్రేమించేవారు. వారి ప్రేమలో తను హాయిగా, విశ్చింతగా కాలం గడిపింది. ఇంతలో తండ్రికి సైనికాధికారులనుంచి పిలుపు వచ్చింది. పాకిస్తాన్ సరిహద్దులలో రక్షణకు ఆయన నియమింపబడ్డాడు. అప్పుడే ఘోరప్రమాదం జరిగింది. ఒకసారి పాకిస్తాన్ సైనికులు జరిపిన కాల్పులలో తండ్రి మరణించాడు.

ఆ రోజు, తండ్రి మరణించినట్లు తెలుపుతూ వచ్చిన టెలిగ్రాం అందుకుని తమ కుటుంబమంతా ఎంతో దుఃఖించారు. అమ్మ ఎంతగానో ఏడ్చింది. తను కూడా ఎంతో బాధపడింది. నాయనమ్మ తమను వోదార్చడానికి ఎంతో కష్ట పడింది.

ఆ రోజుల్లో తరచు, అమ్మ తమ తండ్రినిగురించి తలచుకుంటూ, గడచిన తమ జీవితం గురించి నెమరువేసుకుంటూ ఆనాటి సంఘటనల గురించి చెపుతూ వుండేది. 'మేము ఒక పెళ్ళికి వెళ్ళి

నప్పుడు ఆయనను కలుసుకున్నాను. ఆయన నాకు నచ్చారు. మా పెద్దవాళ్ళు కూడా యిష్టపడి, తర్వాత కొద్దిరోజులకి మా పెళ్ళి జరిపించారు' అని చెప్పింది వొకసారి

తన తండ్రి, తల్లిని చూసి గర్వ పడుతూ వుండేవారు. అటువంటి వుత్తమ యిల్లాలు తన భార్య కావడం తన అదృష్టంగా భావించేవారు. ఆ రోజుల్లో ఎంతో అన్యోన్యంగా జీవితం గడిపారు.

తన తండ్రి మరణించాక, ఆయనకు లభించిన మెడల్స్, కప్పులు తన తల్లి జాగ్రత్తగా భద్రపరచింది. ఆయన ఫోటో వకటి, తన పడకగదిలో గోడకు తగిలించి, రోజూ నమస్కరించేది. ఆయన తన సైనిక దుస్తులతో తీయించు కున్న ఫోటో అది.

తన తండ్రి మరణించాక కొన్నాళ్ళకు నాయనమ్మ విజయవాడలో వున్న తమ స్వంతయింట్లో, తనకు తోడుగా వచ్చి వుండమంది. కానీ అమ్మ వొప్పుకోలేదు. హైదరాబాద్‌లో ఒక స్కూలులో టీచ ర్‌గా పనిచేస్తూ వుండటంవలన, ఆ వుద్యోగం వదిలిరావడానికి యిష్టపడ లేదు. నాయనమ్మ వచ్చి, తనకు తోడుగా వుండమని కోరితే, తను అందుకు అంగీకరించింది. అప్పటినుంచి నాయ నమ్మ దగ్గరే వుంటోంది. ఇక్కడే చదువుకుంటోంది.

రెండేళ్ళు గడిచాయి. స్కూలు జీవితంతో కాలక్షేపంచేస్తూ, తన తల్లి మనస్సులోని బాధను మరచిపోయింది. అదే స్కూలులో పనిచేస్తున్న విజయ కుమార్ అనే టీచర్ ఆమెకు సన్నిహితు డయాడు. ఆయన భార్య మరణించింది.

తను ఒకసారి హైదరాబాద్ వెళ్ళి నప్పుడు విజయకుమార్ తమ యింటికి వచ్చాడు. అందంగా వుంటాడు. నవ్వుతూ సరదాగా మాట్లాడతాడు. ఆయన భార్య పోయిందని తెలుసుకుని తను బాధ పడింది. తర్వాత ఆయన తరచు తమ యింటికి వస్తూ ఉండేవాడు. అప్పు డప్పుడు భోజనం చేసి వెళ్తూవుండేవాడు. అమ్మ ఆయనతో సరదాగా మాట్లాడుతూ వుంటే, ఒక స్నేహితుడితో మర్యాద కోసం సన్నిహితంగా వుంటున్నట్లు భావించింది కానీ ఆయననే పెళ్ళిచేసు కుంటుందని తానెన్నడూ వూహించలేదు.

తన తల్లి ౪౬ సం॥ వయస్సు వచ్చినా, యిప్పటికీ అందంగా ఆకర్షణీ యంగా వుంటుంది. అందువలన విజయ కుమార్ ఆమెను ప్రేమించడంలో ఆశ్చర్యంలేదు... కాని తల్లి, తన తండ్రిని మరచిపోయి, ఆయన మర ణించిన తర్వాత పడిన బాధను మరచి పోయి, ఆయన స్థానంలో విజయ కుమార్‌ని భర్తగా స్వీకరించడమే నమ్మశక్యంగాకుండా వుంది. తాను నాయనమ్మ దగ్గర వుండడంతో ఆమె వివాహానికి తన అడ్డు తొలగిపోయింది.

లక్ష్మి వొకసారి తల్లి దగ్గరనుంచి వచ్చిన వుత్తరం మళ్ళీ చదివింది. 'ఇంట్లో ఒక మగవాడు వుండటం చాలా అవసరం. మీ నాన్నవంటి ఉత్తముని స్థానం ఎవరూ ఆక్రమించరని నాకు తెలుసు. ఆయన గురించిన జ్ఞాపకాలను నువ్వూ, నేనూ మరచిపోలేము. కానీ జీవితాంతం ఆయన గురించి దిగులు పడుతూ కాలం గడపడం అవివేకం... జీవితం ఒక వరం! గతాన్ని మరచి, నవ్వుతూ ఆనందంగా కాలం గడపాలి. నేను బాగా ఆలోచించాకనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ వయస్సులో నాకు వివాహం అంటే, ప్రేమతో కూడు కున్నది కాదు. మోడువారిన నా జీవితంలో నాకు తోడుగా వుండే ఒక మనిషి కావాలనే కోరిక! అంతకంటే మరేమీ లేదు. నీకోసం, మన భవిష్యత్తు కోసం నే నీ నిర్ణయం తీసుకున్నాను. నీకు అభ్యంతరం వుండదని నేను భావిస్తు న్నాను. నీకు కూడా ఆయన నచ్చారని తలుస్తాను. నువ్వు ఒకసారి యిక్కడకు వచ్చి కొన్నాళ్ళు మాతో కాలం గడిపి పోవలసిందిగా కోరుతున్నాను.'

లక్ష్మికి తల్లి ధోరణి నచ్చలేదు. ఆమెలో వచ్చిన ఈ మార్పును సహించ లేకపోయింది. తన తండ్రిని గాఢంగా ప్రేమించిన ఆమె యిప్పుడంతా మర్చి పోయి తనకు వేదాంతం బోధిస్తున్నది. తన చర్యను సమర్థించుకుంటున్నది. ఇప్పుడామె తనకు తల్లి కాదు, విజయ కుమార్ భార్య! ఆయన తనకు తండ్రీ కాలేడు. ఆయన తమ జీవితంలో ప్రవే శించి, తన తల్లిని తనకు కాకుండా దూరంచేసిన ద్రోహి!

లక్ష్మికి వాళ్ళనాయనమ్మ వొకసారి హైదరాబాద్ వెళ్ళి తల్లిని చూచిరమ్మని సలహాయిస్తే, సరేనని వొప్పుకొంది. తను వస్తున్నట్లు తెలియచేస్తూ వుత్తరం వ్రాసింది. 10వ తేదీ, గోల్కొండ ఎక్స్ ప్రెస్‌లో వస్తున్నట్లు వ్రాసింది.

ఆ రోజు స్టేషన్‌కు లక్ష్మి తల్లి సుజాత, విజయకుమార్ లక్ష్మిని రిసీవ్ చేసుకోవడానికి వచ్చారు.

"లక్ష్మీ! కులాసాగావున్నావా?" అంది తల్లి. "కులాసాగానే వున్నాను" అంది లక్ష్మి. విజయకుమార్ కూడా పలక రించాడు.

ఇంటికి వెళ్ళిన కాసేపటికి "అమ్మా! ఎలా వుంది మీ వైవాహిక జీవితం! హానీమూన్‌కి వెళ్ళారా?" అంది లక్ష్మి నవ్వుతూ.

"లక్ష్మీ! నీకు నామీద యింకా కోపం పోలేదా? నేను అన్నీ వివరంగా వ్రాశాను. అయినా, నువ్వు నన్ను యింకా అపార్థం చేసుకుంటున్నావు" అంది సుజాత.

రెండు రోజులు గడిచాయి. ఆ రోజు లక్ష్మి పుట్టినరోజు. లక్ష్మికి తలంటు పోసి, పిండివంటలు చేసింది. ఆ క్రిందటి రోజు సుజాత బజారుకు వెళ్ళి వొక

చీర కొని తెచ్చింది. లక్ష్మి ఆ చీర కట్టుకుంది. మొదట వద్దంది, కానీ తల్లి బ్రతిమాలితే ఒప్పుకుంది.

"రేపు కాలేజీలు తెరిచాక, నువ్వు యిక్కడ కాలేజీలో బి.ఏలో చేరు! ఇక నుంచి నువ్వు మాతోనే వుండిపోవాలి" అంది సుజాత.

"వద్దు! నాకు యిష్టంలేదు. నేను నాయనమ్మ దగ్గరే వుండి చదువుకుంటాను. నువ్వూ, మీ ఆయన హాయిగా జీవించండి. మధ్య నేనెందుకు!" అంది లక్ష్మి కోపంగా.

"అమ్మా! లక్ష్మీ! నువ్వు మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నావు! నువ్వు మీ నాన్నగారిని అమితంగా ప్రేమించావని నాకు తెలుసు! ఆయన గురించి స్మరిస్తూ, మమ్మల్ని ద్వేషించమాకు! నేను నీకు తండ్రిని కాకపోవచ్చు. కాని మీ కుటుంబానికి ఒక ఆప్తుడుగా నన్ను భావించు" అన్నాడు విజయకుమార్. అయినా లక్ష్మికి అతనిపట్ల ద్వేషం పోలేదు.

"నాకు యిక్కడ ఒక్క క్షణం వుండబుద్ధి కావడంలేదు!" అంటూ లక్ష్మి ప్రత్యేకంగా, హాండ్ బాగ్ తీసుకుని వీధిలోకి పరుగెత్తింది. అంతే! రోడ్డుమీద స్పీడుగా వస్తున్న ఒక కారుకింద పడింది. లక్ష్మిని హాస్పటల్‌లో చేర్చారు.

లక్ష్మికి స్పృహవచ్చి కళ్ళు తెరిచేటప్పటికి, తను హాస్పటల్ బెడ్ మీద వుండటం గమనించి ఆశ్చర్యపోయింది. తలకి, వొంటికి కట్లు వున్నాయి. బాధపడుతూ "ఏమిటి? నేను ఎక్కడ వున్నాను?" అంది తల్లితో.

"నీకు యాక్సిడెంట్ అయిందమ్మా! ప్రమాదం ఏమీ లేదన్నాడు డాక్టరు. ఒక వారంరోజుల్లో నయం అవుతుంది, బాధపడమాకు" అంది తల్లి.

తల్లి, విజయకుమార్, హాస్పటల్‌లో లక్ష్మిని జాగ్రత్తగా కనిపెట్టివున్నారు. ఒకరు యింటికి వెళితే, మరొకరు లక్ష్మి తోడుగా వుండి, కబుర్లు చెప్పారు. లక్ష్మిని బాధపడవద్దని ప్రేమతో ఓదార్చారు. వాళ్ళిద్దరూ తనకు చేస్తున్న సేవలు చూసి లక్ష్మిలో మార్పువచ్చింది. వాళ్ళను తను ద్వేషించడం తప్పని తెలుసుకుంది. తండ్రిని మరపించేటట్లు, విజయకుమార్ తనను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. తల్లికూడా తన కోసం ఎంతో దిగులుపడుతూ, తనకు అన్ని సేవలు చేస్తోంది. ఒకరోజు "నువ్వు పెళ్ళి చేసుకున్నావని తెలిసి ఎంతో బాధపడ్డాను. కాని యిప్పుడు నువ్వు చేసింది మంచిపని అని ఒప్పుకుంటున్నాను. ఒంటరిగా ఎన్నాళ్ళు జీవితం గడుపుతాము. మనకు ఒక మగ దిక్కు కావాలి. అందుకు నువ్వు సరి అయినవాడినే ఎన్నుకున్నావు!" అంది లక్ష్మి. సుజాత సంతోషించింది. **